# శ్రుతి

జీవితంలో ముందు ముందు ఎవరి దారి వాళ్ళదనుకున్నాము. నలుగురం ఎప్పుడైనా, ఎక్కడైనా కలవడం కూడా అంత సాధ్యం కాదేమో అని నిరుత్సాహ పడ్డాము. కాన్పూరు ఐ.ఐ.టి.లో బి.టెక్ చదివిన నాలుగేళ్ళు ఎంతో ఆత్మీయంగా గడిచాయి. ఆ తర్వాత ఉద్యోగరీత్యా ఒకచోట పనిచేసే అవకాశం వసుందని ఎవ రమూ కల గనలేదు. అబ్దుల్లాది జమ్మూ, సేతు మాధవన్‌ది తంజావూరు, దేశపాండేది పూనా, నా దేమో తెనాలి. నలువురం ఒకే దేశంలోని వాళ్ళమే. అయినా ఉద్యో గాల విషయంగా ఎవరు ఎక్కడుంటామో తెలియదు.

అయితే, నిజం ఊహకంటే గొప్పది. మా నలువురికీ కడప జిల్లాలో ఒక మారుమూల ఉద్యోగాలు దొరికాయి. బొంబాయి పారిశ్రామికు లెవరో కొత్తగా కట్టే సిమెంటు ఫ్యాక్టరీలో ఆ మా ఉద్యోగాలు. నలువురం ఒకే బ్రాంచి చదవక పోవడం మేలైంది. నేనూ, దేశపాండే మెకానికల్, అబ్దుల్లా ఎలక్ట్రికల్, సేతు మాధవన్ సివిల్, సిమెంటు ఫ్యాక్టరీలోని వివిధ దశల్లో మేమెంతో అనుభవం

సంపాదించే అవకాశం వచ్చిందనీ, అది ముందు ముందు మా కెంతో తోడ్పడు తుందనే సంబరపడ్డాము. నలువురికీ మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశించాము. ఒకే రోజు చేరాము. మా ప్రమోషన్లూ అవీ ఒకే రోజు రావాలి అన్నది మా కల.

మా ఉద్యోగ భూమినిచూసి ఆశ్చర్యపోయాము. అంతా నల్ల ఎడారి. నాపరాళ్ళ కీకారణ్యం. ఆ ఊరు టౌనూకాదు, పల్లేకాదు. ఇళ్ళన్నీ రాళ్ళతో కట్టినవే. మాకు దొరికిన అద్దిల్లు వేయి స్తంభాల గుడి. ఎలెక్ట్రిసిటీ లేదు. నీళ్ళ సౌకర్యం లేదు. గాలికీ కరువే. పవర్ మాత్రం ఉంది. అక్కడున్నవి హోటళ్ళు అనడం కంటే వాటిని మరే పేరుతోనో పిలిస్తే బావుంటుంది. దినపత్రికలు కూడా అప్పుడప్పుడే ఆ ఊరు ముఖం చూస్తున్నట్లుంది. ఏమైనా ఉత్తరప్రదేశ్, మధ్య ప్రదేశ్‌లోని గ్రామాల కంటే నయమే. బందిపోట్ల భయం లేదు. జనం సాధువులు. భాషే వినడం కష్టం. మర్యాద తెలియదు. అందరూ అందర్నీ 'నువ్వు నువ్వు' అనే వాళ్ళే. వీళ్ళ భాషలో 'మీరు' లేదు. కడపలో మా నాన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేసిన రోజుల్లో నాకు ఇది అనుభవమే. అప్పుడు ఇంటరు చదివే వాణ్ణి. మిగతా మా స్నేహితులు ముగ్గురికీ తెలుగు రాదు, కాబట్టి ఇబ్బంది లేదు. అయితే అబ్దుల్లా కనిపెట్టాడు. అక్కడి ముస్లిములు 'తూ' 'తుమ్' అనే మామూలుగా అంటారనీ, 'ఆప్' అనరనీ. నెలరోజుల్లో ఆ కొత్త ప్రాంతానికీ, ఉద్యోగానికీ అలవాటు పడిపోయాము.

ఒకరోజు సాయంకాలమనుకుంటాను, నలువురం ఓ దుకాణంలో భాగంగా ఉన్న కాఫీకొట్టు దగ్గర బెంచీమీద కూర్చొని కాఫీ తాగుతున్నాము. మా కెదురుగా రాతి అరుగుమీద కూర్చున్న యువకుడు నా వైపే చూస్తున్నాడు. పలకరించాలని సందేహిస్తున్నాడు. నాకూ అతనెవరో జ్ఞాపకం రావడంలేదు. అతనే కాసేపు తటపటాయించి చొరవ తీసుకొని పలకరించాడు: "నువ్వు...మీరు ప్రకాశం కదా! కాలేజీలో ఇంటర్లో మీ క్లాస్‌మేట్ని."

జ్ఞాపకం వచ్చింది. అతను చంద్ర. ఇంటర్ చదివే రోజుల్లో నాకున్న మంచి మిత్రుల్లో ఒకడు. ఈ అయిదేళ్ళలో మరీ సన్నబడ్డం వల్ల పోలిక తెలియ లేదు. బట్టలూ అవీ మాసి ఉండడంవల్ల గుర్తుపట్టలేకపోయాను. మర్యాదకొద్దీ క్షమాపణ కోరాను. ఇంటర్ చదువుకునే రోజుల్లో నాకు ఇష్టమైన మిత్రుల్లో ఒకడు. మిగతా నా ముగ్గురు మిత్రులను పరిచయం చేశాను.

మాటల సందర్భంలో తెలిసింది. అతనిది పక్క వూరేనట. బి.కాం., చదివి చదువు మానేశాడట. సిమెంటు ఫ్యాక్టరీ కోసం తనకున్న నాలుగెకరాల భూమి పోవటం వల్ల, ఫ్యాక్టరీ వాళ్ళు క్లర్కు ఉద్యోగం మొన్ననే ఇచ్చారట. రోజూ ఊరు వెళ్ళి వస్తున్నాడట. వాళ్ళ ఊరు రమ్మని మమ్మల్ని ఆహ్వానించాడు. మా స్నేహాలు కలిశాయి.

ఒక సెలవు రోజు చంద్ర ఊరికి వెళ్ళాము. ఎంతో మర్యాద చూపాడు. నాగరికత బలిసిన మా ప్రాంతాల్లో ఇటువంటి అమాయకత్వంతో కూడిన మర్యాదా మన్ననా నేను చూళ్ళేదు. ఆ రాత్రి ఇంటి ముందర ఆరుబయట మంచాలు వేసుకొని వెన్నెల్లో మాట్లాడుతూ పడుకున్నాం.

ఓ పది పదిహేనుమంది బిలబిల వచ్చి మమ్మల్ని పలకరించి పోయారు. వాళ్ళంతా ఫ్యాక్టరీలో పనిచేసే ఆ వూరి వాళ్ళు.

వాళ్ళు వెళ్ళిపోయాక చంద్ర అన్నాడు :

"చూశారు కదా! వీళ్ళంతా ఒకప్పుడు భూమి పుత్రూ ఉన్న రయితులే. వానల్లేక అప్పుల పాలయ్యారు. పంటల్లేక భూములమ్ముకున్నారు. యిప్పుడు కూలీలుగా మారిపోయారు. ఈ ఫ్యాక్టరీ పని పూర్తి అవుతే, మళ్ళీ ఏం జరుగు తుందో తెలీదు. వీళ్ళేమీ 'స్కిల్డ్ లేబరు' కాదు కదా! మట్టి మొయ్యగలరు. రాళ్ళు కొట్టగలరు..."

చంద్ర ఈ ధోరణిలో చాలా చాలా విషయాలు మాట్లాడాడు; ఆ మాటల వెనుక బాధ ఏదో ఉంది. కసి ఏదో ఉంది. అదంతా నాకు కొత్త ప్రపంచం. ఒక రకంగా కొత్త అనుభవం. చూసినంత మాత్రాన, సులభంగా అర్థమయ్యే సమస్యకాదు. అబ్దుల్లా, సేతు, పాండే ఎప్పుడో నిద్రపోయారు. వాళ్ళు అన్నీ మనసుకు పట్టించుకునే రకం కాదు. ఇంటరు రోజుల్లో చదువు తప్ప ఏమీ పట్టని చంద్ర యిప్పుడు మాట్లాడే మాటలు చూసి, నిజంగా నాకు భయం వేసింది. నిద్ర వస్తుందని బొంకాను. చంద్ర మాట్లాడ్డం ఆపాడు. కానీ ఆ రాత్రి సరిగ్గా నాకు నిద్ర పట్టలేదు.

గడచిన ఆరుమాసాల్లో చంద్ర మాకు మరింత సన్నిహితమయ్యాడు. ఎప్పుడైనా రాత్రిళ్ళు మా గదికి వచ్చేవాడు. అక్కడే పడుకునేవాడు. అతని మాటలు వినడానికి బావుండేవి. విన్న తరువాత ఆలోచిస్తే భయమేసేది. కానీ చంద్ర ముఖంలోని నిష్కాపట్యం నన్ను ఆకట్టుకునేది. మాటల్లోని నిజాయితీ నన్ను వద్దన్నా ఆలోచింపచేసేది.

ఒకరోజు సేతు నన్ను హెచ్చరించాడు : 'చంద్ర ప్రమాదకరమైన మనిషి' అనీ, 'మనం కాస్త దూరంగా ఉండా'లనీ.

"ఏమిటా ప్రమాదం" అన్నాను.

సేతు చెప్పుకొచ్చాడు. ప్రమాదకరమైన ట్రేడ్ యూనియన్ సంబంధా లున్నాయని చెప్పాడు. తమిళ కార్మికుల మధ్య, తెలుగువాళ్ళ మధ్య ఏవో తగాదాలు సృష్టిస్తున్నాడని ఆరోపించాడు నేను నమ్మలేదు. ఈ విషయం చంద్రనే అడుగుతానని చెప్పాను. అడగవద్దన్నాడు.

కానీ వారం రోజుల తర్వాత స్థానిక కార్మికులకూ, తమిళకార్మికులకూ పెద్ద యుద్ధం జరిగింది. స్థానికులు తమిళ కార్మికుల్ని చితక బాదారు. ఒక రిద్దరికి బల

మైన గాయాలు తగిలాయి. వాళ్ళు వేసుకున్న సుడిశెల్ని పీకి పారేశారు. ఊళ్ళో రక రకాల ప్రచారం. నిజమేదో తెలియదు. తెలుగు అమ్మాయిని తమిళ కార్మికుడెవడో చెరచడానికి ప్రయత్నం చేయడం వల్ల ఇది జరిగిందని కొందరన్నారు. కార్మికుల మధ్య అప్పుల తగాదా అని కొందరన్నారు.

సేతు మాత్రం మొదటిసారిగా :

"మీ తెలుగు వాళ్ళకు ఏమీ చేతకాకపోయినా అహంకారం ఎక్కువ. తమిళులు స్కిల్డ్ వర్కర్స్. వాళ్ళను చూసి అసూయ. మద్రాసులో అంతమంది తెలుగు వాళ్ళు వుంటే తమిళులు ఇలాగే ప్రవర్తిస్తున్నారా?" అన్నాడు.

చదువుకునే రోజుల్లో అయితే ఈ రకం మాటల్ని సరదా కింద తీసుకునే వాళ్ళం. ఒకమారు సేతు "మా సాహిత్యం మొత్తం భారతదేశంలోనే ప్రాచీన మైంది. మా నాగరికత గొప్పది. మేము క్రీస్తు పూర్వమే ప్రపంచంలోని ఇతర దేశాలతో వ్యాపారం చేశాము. మలేషియాలో చూడండి, ఇండోనేషియాలో చూడండి, శ్రీలంకలో చూడండి మా సంస్కృతి ప్రభావం" అని అన్నాడు.

"నిజమే, ఇప్పటికీ ప్రాచీనులే. దానికి ఉదాహరణ సేతు వీభూది పట్టెలు పెట్టడమే; ఉదయాన్నే తన భక్తిగీతాల అరుపుల్తో మన నిద్ర చెడగొట్టడమే," అని బెంగాలీ మిత్రుడు సేన్ వ్యాఖ్యానిస్తే సేతు కాసేపు ఉడుక్కున్నా, ఆ రోజుల్లో ఇలాంటి వాటివల్ల మా స్నేహాలు ఏ మాత్రం దెబ్బతినలేదు. ఇప్పుడు సేతు కొత్త భాష మాట్లాడుతున్నట్లు తోచింది.

చంద్రను ఒంటరిగా దొరికించుకొని వివరాలు అడిగాను. ఎందుకంటే, అతడు స్థానికుడు. స్థానికులకు ఫ్యాక్టరీలో ఉద్యోగాలు ఎక్కువ రావాలని నాతో ఒకప్పుడు వాదించినవాడు. గొడవ జరిగిన చోట చంద్ర ఉన్నాడని సేతు చెప్పాడు. అతనే రెచ్చగొట్టాడని తమ వాళ్ళు తనతో అన్నట్లు కూడా సేతు చెప్పాడు. చంద్రను విషయం అడిగాను.

చంద్ర మాటలు నాన్చలేదు:

"నేనక్కడ ఉన్నది అబద్ధం. నాకు ట్రేడ్ యూనియన్‌తో సంబంధా లుండేది నిజం. కార్మికుల క్షేమాన్ని కోరేవాడెవడూ ఇట్లాంటి తగాదాలను హర్షించడు. బుద్ధీ జ్ఞానం ఉన్నవాడెవ్వడూ వీటిల్లో దూరడు. అసలు కారణం, ఏదో అంగడి దగ్గర ఒకరి భాషను ఒకరు సరిగా అర్థం చేసుకోక పోవడంవల్ల వచ్చిన చిల్లర తగాదా. దానికి రంగులు పులమడంతో ఇంత అనర్థం జరిగింది. ఒక తమిళుడు కొత్తగా పెట్టిన అంగడి బాగా జరుగుతోందని ఇక్కడి వ్యాపారులు చేసిన కుయుక్తి. నువ్వు గ్రహించాల్సిన నిజం మాత్రం ఒకటి వుంది. సేతు తమిళులతో తనకుండే భాషా పరిచయాన్ని, తను బాగుపడడం కోసం ఉపయోగించుకుంటు న్నాడు; పెద్ద పెద్ద వడ్డీలకు చిల్లర మొత్తాలు అప్పులు ఇచ్చి కూడా," అని చంద్ర అన్నాడు.

కానీ నేను ఆ సమస్యను తరచి తరచి అడగలేదు. చంద్రను నేను ఎక్కువగా నమ్ముతాను. చంద్ర తమిళ కార్మికుల్తో సన్నిహితంగా ఉండడం చాలా సార్లు చూశాను. ఒక తమిళ కార్మికుడికి ప్రమాదం జరిగింది. చంద్రా, మిగతా తెలుగు కార్మికులూ అతనిపట్ల చూపిన అపేక్ష మాటల్లో చెప్పగలిగింది కాదు.

నెల రోజుల తర్వాత సేతు అద్దె ఇంటికి మారిపోయాడు. ఒక తమిళ స్త్రీని వంటకు కుదుర్చుకున్నానని చెప్పాడు. ఈ లోగా పాండే మరో ఇద్దరు మరాఠీ ఇంజనీర్లున్న ఇంట్లోకి మారిపోయాడు. మరాఠీ బ్రహ్మణుడెవర్నో వంటవాడుగా తెచ్చుకున్నామనీ, తెలుగు భోజనం పడలేదనీ చెప్పి వెళ్ళిపోయాడు. బ్రాహ్మణ్యం అప్పటివరకూ గుర్తు రాలేదు మరి. పాండే మారిపోయాడు. ఫ్యాక్టరీలోని మరాఠీ పెద్ద అధికారులతోనే అతను ఎక్కువగా తిరగడం మొదలుపెట్టాడు.

సేతూ, పాండే మా గది నుంచి పోతున్నప్పుడు అబ్దుల్లా బాధపడ్డాడు. కాని ఏమీ అనలేదు. నేనే కాన్నాళ్ళు రోజుల్ని గుర్తు చేశాను. సిటీకి వెళ్ళాలన్నా నలుగురం వెళ్ళాల్సిందే. ఆటోలో ఇద్దరికి మాత్రమే సీట్లుంటే, నలుగురికీ సీట్లు దొరికేంతవరకు ఆగేవాళ్ళం.

ఫ్యాక్టరీ పరిసరాల్లో కట్టడాలకు తవ్వకం పని చురుగ్గా జరుగుతోంది. ఒక రోజు ఏదో దేవతా విగ్రహం బయటపడింది. ఇంకేం? చందాలు పోగయ్యాయి. యాజమాన్యం పెద్ద మొత్తంలో చందా ఇచ్చింది. ఒక చిన్న గుడి నిర్మాణం మొదలైంది.

అదంతా చూసి అబ్దుల్లా విసుక్కున్నాడు :

"ఈ హిందూ దేవతలు రాళ్ళయి ఎక్కడ బడితే అక్కడ దొరుకుతారేం— సిమెంటు ఫ్యాక్టరీకి పనికి వచ్చే ఇక్కడి రాళ్ళు చాలక? దొరకనీలే, కానీ ఇక్కడ పనిచేసే వాళ్ళందరూ హిందువులు కాదే; ముస్లిములున్నారు. మీ క్రైస్తవులున్నారు. ముస్లిములకు మసీదు అఖ్ఖర్లేదా? క్రైస్తవులకు చర్చి అక్కర్లేదా?"

'లౌకిక రాజ్యాంగం' అంటే అబ్దుల్లా వ్యాఖ్యానించినట్లు ఉండాలా? నాకు ఆ పెద్దల భాష అర్థం కాలేదు.

అబ్దుల్లా నాతో ఈ మాటలు మాట్లాడిన నెలరోజుల తర్వాత ఒక చిన్న మసీదు నిర్మాణం కూడా మొదలైంది. యాజమాన్యం దానికీ చందా ఇచ్చింది. స్థానిక ముస్లిములు ముందుకొచ్చారు.

నాకు నవ్వొచ్చింది. నేను కూడా 'స్థానిక క్రైస్తవుల్ని ప్రోత్సహిస్తే' అని అనుకున్నాను. నేను హరిజనున్ననే విషయం గుర్తుకొచ్చింది. కాదు—మా ముత్తాత హరిజనుడు. మా తాత తరంనుంచీ మేము హరిజన క్రైస్తవులం. ఏం జరిగిందో ఏమోగానీ ఒక చిన్న చర్చి నిర్మాణం కూడా మొదలైంది. దానికి ఫ్యాక్టరీ యజమానులు చందాలిచ్చారు.

హిందూదేవత గుడి నిర్మాణం జరిగేటప్పుడే-

"చూడు, ముందు ముందు మసీదు, చర్చికూడా వస్తాయి. వాటికి ఈ పారిశ్రామికవేత్తలు డబ్బిచ్చి ప్రోత్సహిస్తారు. వాళ్ళక్కావల్సింది వ్యక్తిగత మత స్వేచ్ఛకాదు-మూఢభక్తి పెరగడం. మతాల మధ్య గోడలు పెరుగుతూ పోవడం," అని చంద్ర అన్నది జ్ఞాపకంవచ్చింది.

కాన్పూరులో చదువుకునే రోజుల్లో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన మత కలహాలన్నీ ఆ సందర్భంలో గుర్తుకొచ్చాయి. ఆ మధ్య హైదరాబాదులో జరిగినవి గుర్తుకొచ్చాయి. అదృష్టవశాత్తు ఈ ప్రాంతంలో అవి జరగలేదు. వీళ్ళింకా అంత పతనం కాలేదు.

అబ్దుల్లా కూడా గది విడిచి మరోగది చూసుకున్నాడు. ఎవరి లోకాలు వారివి. మా నలుగురి మధ్య మొదట చేరినప్పుడున్న ఆత్మీయత దాదాపు పోయినట్లే. కానీ పలకరింపుల కేమీ కొదవలేదు. దీనికి కారణమేమని తెగ ఆలోచించాను. నా బుర్ర గజిబిజి అయిపోయింది.

చంద్ర వాళ్ళ పల్లెల్లో ఉండకుండా ఎక్కువభాగం నాతోనే ఉంటున్నాడు. మా నలుగురి మిత్రుల వ్యవహారం ప్రస్తావనకు వచ్చినప్పుడు చంద్ర అన్నాడు :

"అసలు విషయం ఫ్యాక్టరీ అధికారుల కళ్ళలోబడి పైకి పోవాలనుకోవడం. దానికోసం మనవాళ్ళు తమ వంతు ప్రయత్నాలు తాము చేసుకుంటున్నారు. చూసినావో లేదోగాని ఈమధ్య సేతు, అబ్దుల్లా, దేశపాండేకు పార్టీలూ అవీ ఇచ్చి కొంత మీద కూర్చోపెడ్తున్నారు. ఈ మధ్యనే వచ్చిన కన్‌స్ట్రక్షన్ చీఫ్ ఇంజనీర్, దేశపాండే బంధువంట. ఈ రోజుల్లో స్నేహాలు, బంధుత్వాలు అన్నీ త్రాసులో తూగేవే కదా !"

ఈ మాటలతో నాకు దిగులుపట్టుకుంది. వాళ్ళు నాముందే పెద్ద ఉద్యోగాల్లోకి పోతారు. నేను వాళ్ళకింద పనిచేయాల్సి వుంటుంది. ఒకరకంగా వాళ్ళమీద ఈర్ష్యకూడా కలిగింది. నేను చంద్ర ద్వారా స్థానికుల్ని రెచ్చగొట్టలేనా?' అని కూడా ఆలోచించాను. నేను అంత సమర్థుణ్ణి ఏనాడూ కాలేను.

సరిగ్గా ఆ రోజుల్లోనే కూలీరేట్ల విషయంమీదా, ఇతర కార్మిక సమస్యలమీదా ట్రేడ్ యూనియన్ సమ్మెకు పిలుపు ఇచ్చింది.

సమ్మెకు ముందురోజు రాత్రి యూనిట్ ఇన్చార్జి సంతోజీ నుంచి పిలుపు వచ్చింది. నేను వెళ్ళేటప్పటికి మా క్లాస్‌మేట్లు ముగ్గురూ అక్కడున్నారు. ఆశ్చర్యం వేసింది. నాతో మాట్లాడవలసింది ఉందని సేతూను, అబ్దుల్లాను, పాండేను ముందు గదిలోకి వెళ్ళమన్నాడు. తలుపులు మూసుకున్నాయి. నాలో సన్నగా వణకు మొదలైంది. భయం బయటపడనీకుండా కూర్చున్నాను. ఒకచేత్తో బట్టతల దువ్వుకుంటూ, మరోచేత్తో టేబుల్‌మీద పేపర్ వెయిట్‌ను ఆడిస్తూ అమెరికన్ ఆక్సెంట్‌తో సంతోజీ లెక్చరు మొదలు పెట్టాడు :

"ఈ సమ్మె సంగతి మీకు తెలుసుకదా ! ఇంత వెనుకబడిన ప్రాంతంలో లక్షలుకాదు, కోట్లు పోసున్నాం. ఎందుకు ? ఈ సిమెంటు ఫ్యాక్టరీకితోడు ఇక్కడే మరో ఎరువుల ఫ్యాక్టరీ మన కంపెనీ ఆలోచనలో ఉంది. ఎందుకు? కేవలం లాభాలకోసమా? కాదు. వెనుకబడిన ప్రాంతాలను మన పరిశ్రమలతో ముందుకు తీసుకుపోదామని. ఈ ఫ్యాక్టరీనే లేకపోతే చాలమంది జనం పస్తులుండేవారు. మూడు వేలు చెయ్యని ఎకరా భూమికి పదివేలు ఇస్తున్నాం. మన ఫ్యాక్టరీతో ఎంతో అభివృద్ధి జరుగుతోంది? మొదట వచ్చినప్పుడు ఇక్కడ మంచి బ్లేడుకూడా దొరికేది కాదు. ఇప్పుడు స్మగుల్డు గూడ్సు దొరుకుతున్నాయి. ఇప్పుడు మన వుద్యోగులకున్న సౌకర్యాలు ప్రభుత్వ సంస్థల్లో వున్నాయా ? మన కంపెనీలాంటి ప్రైవేటు సంస్థల లక్ష్యాలు ప్రభుత్వానికి తెలుసుకాబట్టే మనకు లైసెన్సులిస్తోంది. ఇక ఒక సంవత్సరంలో సిమెంటు ప్రొడక్షను మొదలవుతుంది. మీకెంతో భవిష్యత్తు ఉంది. ఏమంటారు?"

నేనేమంటాను? నీరసంగా ఒక నవ్వు నవ్వాను. రహస్యంగా మాట్లాడే ధోరణిలో సంతోజీ చెప్పాడు :

"మీకు చంద్ర మంచి మిత్రుడుకదా ! ఈ స్ట్రయికు వెనుక అతనూ, అతన్ని ప్రోత్సహించే ట్రేడ్ యూనియన్ లీడరూ ఉన్నారు. ఆ ట్రేడ్ యూనియన్ లీడరుకు పనిపాటా లేదు. చంద్ర మన ఉద్యోగి అయివుండి వీటిలో తల దూరుస్తున్నాడు. నాలుగు రూపాయలు పెంచటం ఒక సమస్య కాదు.

ఈ సమస్యకు మనం తల వంచామంటే ఇక ట్రేడ్ యూనియన్ బలపడి తీరుతుంది. ఆ తర్వాతే అసలు తలనొప్పి. చంద్ర మనవైపు వచ్చాడంటే స్ట్రయికు వీగిపోతుంది. ఊళ్ళోనూ, చుట్టుపక్కలా ఎక్కువగా అతనికి పలుకుబడి ఉంది. చంద్రతో మీరు మాట్లాడాలి. మీరిద్దరూ తెలుసువాళ్ళు. పైగా నీ రూంలోనే ఉంటాడని విన్నాను. అది మంచిదేలే. ఈ పని చేశారంటే మీ ప్రమోషన్ రికమెండ్ చేస్తాను. ముందు ముందు ఫారిన్ ఛాన్సు కూడా..."

నాకంతా అయోమయంగా ఉంది. చంద్రకు కార్మికుల్లో ఎంత పలుకుబడి వుందో నాకంటే ఇన్చార్జికే బాగా తెలిసినట్లుంది. అతని ప్రయోజనం తెలిసినట్లుంది. అయితే చంద్ర నా మాట వింటాడా? అదేమాట అడిగాను.

"వినేట్లు చేయాలి. ఈ వందమంది హరిజన కార్మికుల్ని చీలిస్తే వింటాడు. ఆ పని మీరు సులభంగా చెయ్యవచ్చు."

సంతోజీ పథకం అర్థమైంది. గట్టి బట్టతల. ఏది చెప్పాలో దిక్కు తోచలేదు. "ప్రయత్నిస్తాను" అని గొణిగాను.

"ఓ.కే. గుడ్‌బాయ్", అంటూ భుజం తట్టి "గుడ్‌నైట్" చెప్పాడు.

మిగతా ఇద్దరితో ఏంచెప్పి వుంటాడో ఊహించాను. సేతును తమిళ కార్మికులతో మాట్లాడమని ఉంటాడు. అబ్దుల్లాను ముస్లింలతో మాట్లాడమని

ఉంటాడు. మా ముగ్గిరికి ఒకే రకం ఎరలు. ప్రమోషనూ, ఫారిన్ చాన్సు! మొదటిసారిగా అసహ్యం వేసింది. ఎంత కక్కుర్తి! ఎన్ని కుయుక్తులు! ఎంత వంచన! ఈ విషయమంతా చంద్రకు చెబుదామనుకున్నాను. ఎంత అపరాత్రి అయినా గదికివచ్చే చంద్ర ఆ రోజు రాత్రి రాలేదు.

ఉదయం వర్క్‌స్పాట్ దగ్గరకు వెళ్ళేవేళకు సమ్మె చేస్తున్న జనం. ఇన్నాళ్ళు దరిద్రం ఓడుతూ అమాయకంగా కన్పించిన వాళ్ళలో పట్టుదల. ఒకే పాట, ఒకే మాట–"కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ. ఎవరో తమిళుడు "సేతూ మాధవన్" అని అరిచాడు. యువకుల గొంతులు "డౌన్‌డౌన్" అన్నాయి. ఎవరో ముస్లిం "అబ్దుల్లా" అన్నాడు. కొన్ని గొంతులు "ముర్దాబాద్" అన్నాయి. ముక్త కంఠంగా మరికొన్ని నినాదాలు.

ఆ నినాదాల మధ్య తెలుగు కార్మికులూ, తమిళ కార్మికులూ అనే భేదం లేదు. కులాల్లేవు, మతాల్లేవు. వాళ్ళందరూ రెండు రూపాయల కూలీ పెంచడం కోసమే ఆ నినాదం చేస్తున్నారా? నేను నమ్మను గాక నమ్మను. అవి సుందరమైన భవిష్యత్తుకోసం సామూహికంగా తెగిస్తున్న నినాదాలు.

సమైక్యంగా సాగుతోన్న జనం.

మరి పెద్ద పెద్ద చదువులు చదువుకున్న వాళ్ళూ, పదవుల్లో ఉన్నవాళ్ళూ చేస్తున్న పని ఏమిటి? వాళ్ళ మధ్య ఏ విలువలు రాజ్యమేలుతున్నాయి?

నా ఆలోచనలు ఇప్పుడిప్పుడే తెగుతున్నాయి.

○ జనవరి 1984, జ్యోతి మాసపత్రిక.